# స్వయంకృతం



**విమానం** మీనంబాకం విమానాశ్రయంలో దిగింది. విమానం దిగడానికని నేను మెట్ల దగ్గిరికి వచ్చిన తరవాత నా కళ్ళు అప్రయత్నంగానే మాలతి కోసమని వెదకసాగాయి. ఎన్నిదేశాలు తిరిగినా నా మనస్సు మాలతిని గూర్చి ఆలోచిస్తూనే ఉంది. హాంకాంగ్‌లో బట్టల దుకాణంలో మాలతికని లేత నీలంరంగు షిఫాన్ చీరమీద తెల్లని క్రోషెపనితో రోజాలు కుట్టిన చీర కొంటూ, మాలతి దాన్నిగూర్చి వర్ణించబోయే తీరు గుర్తుకువచ్చి నవ్వుకోవటం జ్ఞప్తికి వచ్చింది. ''అదుగో/మావయ్యా, మాకాశా! ఆ నీలాకాశంలో దూదిపింజల్లా మేఘాలెలా కదులుతున్నాయో! ఈ చీర చూస్తే నాకు ఆ ఆకాశాన్ని చూసినట్లే అనిపిస్తూంది'' అంటుంది. ఇలా ఆలోచిస్తూ విమానాశ్రయాన్ని కలయ చూసిన నా కళ్ళకు మాలతి కనబడింది. పాలనురగ లాంటి తెల్లటి చీరలో మెరిసిపోతూ కనబడింది. వెంటనే చెయ్యి ఆడించి దిగాను. పాడు కష్టమ్ము! ప్రయాణం త్వరగా అయినప్పటికీ ఈ కష్టమ్ము







గౌర్ మోహన్ దాస్ అండ్ కం.,
233, పాత చైనాబజార్ వీధి,
కలకత్తా—1
ఫోన్: 22—6580

ఐటెక్స
సౌందర్యదోహదములు

★ ఐటెక్స్ (కాటుక)
★ ఐటెక్స్ బింది
★ ఐటెక్స్ కుంకుం పేస్టు

తయారుచేసినవారు:
అరవింద్ లేబరెటరీస్
పో. బా. 1415 మద్రాసు-17





పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన విరునామాన్నూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోనూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధివిక్షేపములు, లాటరీ, అకస్మా ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1–25 పైకముమాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా వూచీపైన పంపబడును. మేము పంపిన ఫోర్కాస్టు మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**

వల్ల ఎంత ఆలస్యం జరుగుతుందో కదా!

ఒక గంటన్నర అయ్యాక మాలతి దగ్గిరకు వెళ్లాను. ఆమె అతి ప్రయాసతో నవ్వింది. నేను నిర్ఘాంతపోయాను!

"ప్రయాణం కులాసాగా జరిగిందా, మావయ్యా?" అంది.

"ఓ, బాగానే జరిగింది. చూడవలసినవన్నీ చూసే శాను" అంటూ బయటికి నడిచాను. డ్రైవరు వచ్చి నమస్కారం చేశాడు. మాలతీ, నేనూ కలిసి వెళ్లి కారులో కూర్చున్నాం. మాలతి పూర్వంలా లేదని స్పష్టంగా తెలుస్తూంది. మొదట వారానికో ఉత్తరం వ్రాసేది. శేఖరం వచ్చినప్పుడు తను ఏ చీర కట్టు కుందో, శేఖరం ఎంతసేపున్నాడో, తాను వీణమీద ఏ పాట వాయించిందో అన్నీ వివరంగా వ్రాసేది మాలతి. కానీ గత రెండునెలలుగా నా ప్రయాణాలనుగూర్చి తప్ప వేరే ఏ విషయమూ రాయకపోవడానికి కారణం నేను ఊహించుకోలేకపోయాను. డ్రైవరు ఎదురుగా ఏమీ అడగడానికి ఇష్టంలేనందున వేరే విషయాలు మాట్లాడుతూ కూర్చున్నాను.

ఇంటికి వచ్చాక స్నానం అవీ ముగించి మేడమీద డాబాలో కూర్చున్నాను. మాలతి కాఫీ, ఫలహారం ట్రేలో పెట్టి తీసుకువచ్చింది. నాపక్క టీపాయి మీద పెట్టి వెళ్లిపోబోయింది.

"మాలతీ! నువ్వు ఏదోలాగున్నావేమమ్మా?" అని అడిగాను.

"అదేమిటి ఆ ప్రశ్న,మావయ్యా! బాగానేఉన్నానే!" అంది.

"మాలతీ, ఈ ముక్క వేరే ఎవరితోనైనా అని వారిని నమ్మించగలవేమోగానీ నన్నుమాత్రం నమ్మించ లేవు" అన్నాను. మాలతి ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయింది. నేనింక ఏమీ ప్రశ్నించదలుచుకోలేదు. బహుశా శేఖరం మోసంచేశాడేమో! వాళ్ళవాళ్ళు ఈ పెళ్లికి ఒప్పుకోలేదంటే నేను నమ్మను. ఈ కాలంలో ఆడపిల్లల అందం, చదువు అవీ ఎవరికి కావాలి? ఏ పిల్ల ఎక్కువ మూట తెస్తే ఆ పిల్లే రంభ, ఊర్వశిగా కనపడుతుంది వాళ్లకి. ఎంత కట్నం కావాలన్నా ఇవ్వగలరు! ఇంకా ఏం కావాలి వాళ్లకి? బహుశా శేఖరమే మోసం చేసి ఉండాలి. లేకపోతే మాలతి ఇంత విచారంగా ఎందుకుంటుంది? రామయ్య వచ్చిన అడుగుల సవ్వడికి తిరిగి చూశాను. ఉత్తరాలన్నీ మోసుకువచ్చి ఇచ్చాడు. అవన్నీ చదువుతున్న నాకు కాలం తెలియలేదు.

భోజనం తయారుగా ఉందని వంటచేసే నాయరు వచ్చి చెప్పాడు. భోజనాలదగ్గిరా మాలతి ఏమీ మాట్లాడలేదు. మాలతి తత్త్వం నాకు తెలుసు. కొంతసేపయ్యాక తానే స్వయంగా వచ్చి చెబుతుంది. భోజనాలయ్యాక పెట్టెలోంచి మాలతికోసం కొన్న వన్నీ తీసి ఇచ్చాను. కాలిఫోర్నియాలో కొన్న హేండ్‌బాగ్, స్విట్జర్లండులో కొన్న వాచీ, పారిస్‌లో కొన్న సెంటూ, హాంగ్‌కాంగ్‌లో కొన్న చీరా అన్నీ ఇచ్చాను. శేఖరానికి తెచ్చిన వాచీ ఇస్తూ "మాలతీ, ఇది శేఖరానికి. శేఖరానికి నచ్చుతుందనే ఆ నీలంరంగు చీర నీకు తెచ్చాను" అన్నాను. మాలతి కళ్లలో నీళ్లు నిలిచాయి.

"మాలతీ, ఏమయిందమ్మా?" అని మృదువుగా

అడిగాను. మాలతి జవాబేమీ చెప్పకుండా తన గది లోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. నిర్ఘాంతపోయాను నేను

మరునాడు పొద్దున్న బాగా పొద్దెక్కాక లేచాను. నా మంచం పక్క టేబిల్‌మీద అష్‌ట్రేలోని సిగరెట్టు పీకలన్నీ గతరాత్రిని నాకు జ్ఞాపకం చేశాయి. నిద్రపట్టక, మాలతి ఎందుకు ఏడుస్తూందో తెలియక సతమతమయినప్పుడు కాల్చిన సిగరెట్లవి. విదేశాలకు వెళ్ళి, హాయిగా తిరిగి, అన్ని రకాలయిన సుఖాల్నీ చవిచూసి వచ్చిన నాకు ఇంటికి రాగానే ఇలా జరగడం విసుగు కలిగించింది. కానీ మాలతి, నేను పెంచిన మాలతి విచారంగా ఉండటం నేను భరించలేను. లేచి పనులన్నీ ముగించుకుని ఆఫీసుకు వెళ్ళిపోయాను.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి మాలతి నాకోసం కాఫీ తెచ్చింది. నేను కాఫీ తాగుతూంటే చెప్పింది "మావయ్యా, నాకు మెడిసిన్‌లో చేరాలని ఉంది" అని.

"ఎందుకు? దానికి శేఖరం ఒప్పుకుంటాడా?" అన్నాను ఆశ్చర్యంతో.

"ఆయనే చేరమని చెప్పారు. నువ్వు తలుచుకుంటే ఎక్కడో ఒకచోట నాకు సీటు ఇప్పించగలవు" అంది.

బి. ఎస్‌సి. ముగించి నాలుగేళ్ళుగా ఇంట్లో కూర్చున్న మాలతికి మెడిసిన్ చదవాలని ఎందుకు బుద్ధి పుట్టింది? శేఖరాన్ని పెళ్ళాడితే చదవడానికి తీరిక ఎక్కడిది? అదే అడిగాను.

"డాక్టరుగారిని పెళ్ళాడితే ఇంక నీకు డాక్టరీ చదవడానికి తీరికెక్కడిది?" అన్నాను.

మాలతి ముఖం పాలిపోయింది. కళ్ళలో నీరు ఉబ్బి తిరిగింది.

"అది జరగదు,మావయ్యా! అందుకే నాకు చదవాలని ఉంది" అంది.

"ఏమమ్మా, శేఖరం అడినమాట తప్పాడా?"

"ఆయన అలాంటివారు కాదని నీకు తెలియదా, మావయ్యా?" అని ఎదురు ప్రశ్న వేసింది మాలతి.

"మరయితే వాళ్లవాళ్ళు ఒప్పుకోలేదా?" అన్నాను.

"ఊఁ" అంది మాలతి.

"మనదీ వాళ్లదీ ఒక్కటే శాఖ కూడాను. అదీ గాక వాళ్ళకి కావలిసివస్తే ఎంత కట్నమైనా నే నివ్వగలను కదా! మరి ఎందుకు ఒప్పుకోలేదో తెలుసా నీకు?" అని అడిగాను.

"మావయ్యా, డబ్బుతో సంపాదించనేరనివి కొన్ని ఉంటాయి కదా!" అంది.

నేను ఆశ్చర్యంతో చూశాను. నా కింతవరకూ డబ్బుతో కొననేరనివి కూడా ఉంటాయన్న సంగతి తెలియదు. నాపుట్టుకి నేను నాకేం కావాలన్నా.... ఏదైనాసరే, డబ్బుతోటే కొనుక్కోగలుగుతున్నాను.

"నీకర్థం కాదులే,మావయ్యా" అంటున్న మాలతి కళ్లలోని భావాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నించిన నాకు ఆ కళ్లలో ఏదో విరక్తిలాంటిది కనిపించింది. అంతే. ఇంకేం అర్థం కాలేదు మాలతి ఇంక మాటకు అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయింది. మాలతికి మెడిసిన్‌లో కాకపోయినా, ఎమ్మెస్సీలోనైనా సీటు వచ్చేందుకు నేను ప్రయత్నించగలను. కానీ శేఖరాన్ని

ఎవరి జీవితం వారిది. ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. అందునా పుష్కలంగా డబ్బే ఉన్న మగవాడికి బెడదు ఏముంది? అలాంటి వాడు దేనికీ వెరవడు. ఏమైనా చింతించడు. కాని, తన చర్యల మూలంగా, తాను ప్రాణ సమానంగా పెంచినవారి జీవితాలు తల క్రిందులైనప్పుడు ఎంతవరకు నిర్వికారంగా ఉండగలడన్నది వేరు.

---

ఒక్కసారి చూసి సంగతులన్నీ తెలుసుకోవాలని నా మనస్సు ఆరాటపడింది. కానీ హాస్పిటల్‌కి ఫోన్ చేసే సరికి డాక్టరు శేఖరం లీవుమీద వెళ్ళాడనీ, ఊళ్ళో లేడనీ తెలిసింది.

ఒక వారం గడిచిపోయింది. శేఖరం ఇంకా రాలేదు. మాలతి తనూ, తన పూజలూ, తన వీణ తప్ప వేరే విషయాలేవీ పట్టించుకోవటంలేదు. ఆ రోజు సాయంత్రం కారు తీసుకుని బయలుదేరాను. కాంపౌండు గేటు దాటి కొంచెం దూరం వెళ్లగానే కారు ఆగిపోయింది. దిగి బానెట్ ఎత్తి ఏం పాడయిందా అని చూస్తున్నాను. నా పక్కనించే టాక్సీ వెళ్ళేసరికి తలఎత్తి చూశాను. టాక్సీలో శేఖరం తల్లి శారదమ్మగారు కనపడ్డారు. టాక్సీ మా ఇంటికే వెళ్లడం చూసి కుతూహలం చంపుకోలేక బానెట్ దింపి కిటికీ అద్దాలన్నీ ఎత్తి కారుని లాక్‌చేసి ఇంటికి వెళ్లాను. శేఖరం తల్లి పూజగదిలోకి వెళ్లడం చూసి నేనూ వెనకాలే వెళ్లాను. రామయ్య వచ్చి పూజగది బయట వసారాలో దీపం వెలిగించబోతే వద్దని సైగ చేశాను. ఆ వసారాలో చీకటిలో నిలబడ్డాను.

పూజగదిలో శారదమ్మగారు దండం పెట్టుకున్నారు. ఆవునేతి దీపాలతో, రంగు రంగుల పువ్వులతో అలంకరించిన దేవుడి మందిరంతో దేవుణ్ణి చూడనేరక నేను తల వంచుకున్నాను. మాలతి వీణ పాట ఆపాక శారదమ్మగారిని చూసి కూర్చోమని పీట వేసింది. ఆవిడ అటూ ఇటూ చూసి మెల్లిగా ప్రారంభించింది.

"శేఖరంకోసమని నిన్ను చూడ్డానికి వచ్చానమ్మా!" అంది ఆవిడ.

"ఆయన అన్నీ చెప్పారండీ!" అంది మాలతి.

శారదమ్మగారి ధర్మమా అని శేఖరం ఏం చెప్పి ఉంటాడో నేను ఊహించుకోవలిసిన అవసరం లేకపోయింది.

"ఆ రోజు శేఖరం అలా చెప్పగానే వాళ్ల నాన్నగారు ఏమీ మాట్లాడలేదమ్మా! కానీ మా పెద్దవాడు సుందరం తారాజువ్వలా లేచాడు. డబ్బు, హోదా, పిల్ల అందచందాలేగాక, కుటుంబాన్ని గూర్చీ ఆలోచించాలన్నాడు. వాడే చెప్పాడమ్మా మీ రాజు మామయ్యను గూర్చి. 'ఊళ్ళో ఉండే భోగం వాళ్లంతా వాడికి తెలుసు. అలాంటివాడి ఇంట్లో వేరే పెద్ద దక్షత లేకుండా ఒంటరిగా ఉన్న ఆడపిల్లమీద

---

'విశాఖ'

---

వాడి కళ్ళు పడలేదంటే ఎవరు నమ్ముతారు? పడకపోయినా మాత్రం ఆ పిల్లని ఈ ఇంటికెలా తెచ్చుకోవాలనుకుంటున్నారు? వాడో శుద్ధ జులాయివెధవ. డబ్బుంది అన్న అహంకారం' అంటూ రంకెలు వేశాడు" అంది.

ఇది వింటూన్న నాకు మతిపోయినట్లు అనిపించింది. నేను మద్యాన్ని, మదవతులను ఎరుగిఉన్న మాట నిజమే. 'ఉమెన్ అండ్ వైన్' అనుభవించకపోతే ఈ జీవితం ఎందుకు? కానీ శివశివా! అక్కయ్య పోయిననాటి నుంచీ స్వంత కూతురులా పెంచానే మాలతిని. ఆ మాలతిపై నా చెడ్డచూపు ఎప్పుడూ పడలేదని ఆవిణ్ణి నేనెలా ఒప్పించగలను? మాలతిపైన పడ్డ అభాండం విన్న నాకు ఆలోచించే శక్తి పోయింది. యాంత్రికంగా వాళ్ల మాటలు వినసాగాను.


"మీ అబ్బాయి అన్నీ చెప్పారండీ. కానీ నాదీ ఒక్క మాట వినండి. చెడ్డవారందరూ అన్ని విషయాల లోనూ చెడ్డగా ఉండరు. మా రాజు మావయ్య సంగతి నాకు పూర్తిగా తెలుసు. మీ అబ్బాయికీ తెలుసు. కానీ మా అమ్మ పోయినప్పటినుంచీ మావయ్యే నన్ను పెంచాడు. తల్లో మేనమామో అంటారు కదా మన వాళ్ళు. మావయ్య నా దగ్గిర చాలా మంచిగా ఉన్నాడు. ఈ విషయాన్ని అందరికీ చెప్పి నమ్మించగలిగే శక్తి నాకు లేదు. మావయ్యకి ఎన్నో వ్యసనాలున్నాయి. నాకూ తెలుసు. ఈ ఏడాది విదేశాలలో ఏమేం చేశాడో ఆ భగవంతుడికే తెలియాలి. కానీ మావయ్య మనస్సు వెన్నపూస. కుటుంబస్త్రీల జోలికి ఎప్పుడూ వెళ్లడు. మావయ్యే ఆవిధంగా నన్ను చెడ్డ అభిప్రాయంతో చూసి ఉంటే, మావయ్య చేసిన మేలు మరిచిపోయి, కృతఘ్నురాలినై, వెళ్లిపోయి ఏ స్త్రీ సేవామందిరంలోనో చేరిపోయి ఉందును. మీ అబ్బాయికీ ఈ సంగతి తెలుసు" అంది మాలతి.

"మాలతీ, నిన్ను ఇలా ఈ పూజ గదిలో చూశాక నాకు ధైర్యం వచ్చిందమ్మా! ఎలాగైనా మావారిని ఈ పెళ్లికి ఒప్పించే బాధ్యత నాది" అంటూ ఆవిడ రావడం చూసి నేను బయటకి వెళ్లిపోయి కారుకేసి నడవసాగాను.

నా మనోనేత్రాలముందు నేను ఆనాటిదాకా సంతోషం, ఆనందం అనుకుంటూ చేసిన పాపాలు కదలాడసాగాయి. మరీ గతసంవత్సరం పూర్తిగా విదేశాలలో నాకేగదా డబ్బుందని నా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడుతూ, మాధుర్యం అంటూ చవిచూసినవన్నీ తలుచుకుంటుంటే నాకే వికారమనిపించింది. నా బలహీనత నాకు తెలుసు. అందుకే పెళ్లిచేసుకుని ఒక అమ్మాయి జీవితం నాశనం చెయ్యడమెందుకని పెళ్ళి చేసుకోలేదు. కానీ నా తిరుగుళ్లవల్ల, నా చేష్టలవల్ల మాలతికి అపకారం జరుగుతుందని నాకు తోచలేదు. అక్కయ్య చనిపోయినప్పుడు మాలతి బాధ్యత స్వీకరించాను. చదువుకీ, సౌకర్యాలకీ లోటు చెయ్యలేదు. మాలతికి శేఖరం పరిచయమైనప్పుడే శేఖరం మాలతికి తగ్గ భర్త అని అనుకున్నాను. శేఖరంకూడా అదే ఉద్దేశంతో ఉన్నట్లు తెలియగానే ఉప్పొంగిపోయాను. కానీ ... మాలతికీ శేఖరానికి మధ్యన నేనే అడ్డు గోడలాగా నిలబడతానని

తలుచుకోలేదు. కాని శేఖరం తల్లి తప్పక ఈ పెళ్లి చేయగలరన్న ధైర్యం ఎందుకో నాకు ఏర్పడింది. ఏమో అది నా భ్రాంతేనేమో!

విదేశాలకు వెళ్లినందువల్ల చూసుకోవలసిన పను లనేకం ఉండిపోయాయి. కలకత్తా బ్రాంచికి వెళ్లవలసిన అవసరం ఏర్పడింది. వెంటనే బయలుదేరి వెళ్లవలసి వచ్చింది. నేను లేని సమయంలో అన్నీ సర్వంగా జరిగిపోతాయన్న భ్రమతో విమానం ఎక్కి వెళ్లిపోయాను. పూర్వం అయితే పెద్ద రెస్టారెంట్సులో



పరాయి ముస్తాబు ఫోటో—బ్రహ్మదేవ్ (డేరాడూన్

దిగి ఆఫీసు పనులయ్యాక సాయంత్రాలు అతి విలాసంగా గడిపేవాడిని. కాని నా కీసారి వాటిపై దృష్టి మరలలేదు. మాలతి భవిష్యత్తు నాశనంచేసే పనులు చెయ్యాలనిపించలేదు. మద్రాసీ హోటల్లో గది సంపాదించి ఉండిపోయాను. ఆఫీసు పని ముగించుకున్నాక బయలుదేరదామనుకుంటూంటే కలకత్తాలో ఒక్కటే అల్లర్లు. దీనికి సాయం ప్లేనులో బుకింగు దొరక లేదు. రైల్లో వెడదామంటే హౌరాలో రైళ్లనే అంటిస్తున్నారనే వార్తలు! హోటలు వదిలి బయటికే రాలేకపోయాను. ఛీ. పాడు కలకత్తా! ఈ ఊళ్లో సమ్మెలకీ, అల్లర్లకీ ఒక కారణం కావాలా? ట్రాముల్లో ఒక పైసా ఎక్కించారనో, బస్సులు దారి మార్పించారనో, బియ్యం వెల ఎక్కువ చేశారనో, దేనికో దానికి హర్తాళ్లూ, అంటించెయ్యడాలూను. ఇది ఇక్కడివాళ్ళకి మామూలే!

అల్లర్లు తగ్గి నేను బయలుదేరేసరికి నెలరోజులు పట్టింది. ఇంటికి వచ్చాక మాలతిని చూడడం వడలేదు. మాలతి పూజ చేసుకుంటూంది అని పైకి వెళ్లిపోయాను. స్నానం అవీ ముగించి బట్టలు మార్చుకుని కిందికి వచ్చాను. రామయ్య నాకు వచ్చిన ఉత్తరాలన్నీ తీసుకువచ్చాడు. అందులోనించి పసుపురాసిన శుభలేఖ ఒకటి బయటికి తొంగి చూస్తూంది. మిగతా అన్నింటినీ టీపాయిమీద పెట్టేసి శుభలేఖ చూశాను. శేఖరం పెళ్లి శుభలేఖ. వధువు పేరు చూడలేదు. చూడాలనిపించలేదు. మాలతి కాకపోయాక ఎవరైతే మాత్రం నాకేం శ్రద్ధ!

పూజ ముగించి వచ్చిన మాలతిని అడిగాను "శేఖరం తల్లి ఏమీ చెయ్యలేకపోయార్యా మాలతీ?" అని.

ఆమె ఆశ్చర్యపోయింది. మెల్లిగా ఆ రోజున నేను విన్నవన్నీ చెప్పాను. మాలతి మెల్లిగా చెప్పసాగింది:

"నీ కసలు చెప్పకూడదనే అనుకున్నాను మావయ్యా. కానీ నీకెలాగూ తెలిసిపోయింది. ఆవిడమాత్రం ఏం చెయ్యగలరు, కట్టుకున్న మొగుడూ కన్నకొడుకూ ఒప్పుకోకపోతే? పెద్దాయన సుందరానికి పిల్లలులేరు కదా! అలాంటిది రెండో అతనికి పుట్టబోయేవారే వాళ్లకి వంశోద్ధారకులు కావాలి. మనలాంటివారి ఇంటి పిల్లని చేసుకోవడం పెద్దాయనకి గానీ, శేఖరం నాన్నకిగానీ, అప్పచెల్లెళ్లకిగానీ ఇష్టం లేదుట. ఒక కుటుంబాన్ని నిలవగలిగేందుకు పెళ్లిగానీ ముక్కలు చెయ్యడానికి కాదుగదా! అందుకే నేనూ శేఖరం మా పెళ్లి జరగకూడదని తీర్మానించుకున్నాం. మావయ్యా, పెళ్లి జరిగినా వాళ్లింట్లో ఆడవాళ్ళు నిన్ను వివిధరకాలుగా తిట్టిపోస్తూంటే నే నెలాగ వినగలుగుతాను? నువ్వు ఎవరి కెలాంటివాడవో నాకు తెలియదు. కానీ నామట్టుకి మంచివాడివే. నన్ను గారంగా పెంచావు. నన్ను పెంచిన నిన్ను ఎవరేనా ఏమ్మైనా అంటే నేను సహించనేరను.

"శేఖరం తల్లి ఎంత మంచి ఆవిడో నీకూ తెలుసు కదా! ఆవిడికి మాత్రం మనవర్ని — ఆదీ కొడుకు పిల్లల్ని — ఎత్తుకుని ముద్దు పెట్టుకోవాలని ఉండదా? అందుకే శేఖరాన్ని పెళ్లి చేసుకోమన్నాను. మావయ్యా! అదే ఆ శుభలేఖ. ఆ పిల్ల శేఖరానికి మేన మామ కూతురే. ఆ అమ్మాయి కన్నీ తెలుసు. శేఖరాన్ని ఏమీ బాధపెట్టదు" అని . మాలతి అంటుంటే నా గుండె విలవిల్లాడింది.

"మావయ్యా, నా సీటుకోసం తప్పక ప్రయత్నించు, మావయ్యా!" అంటూ వెళుతున్న మాలతికేసి చూస్తూ ఉండిపోయాను.

"డబ్బుతో సంపాదించనేరనివి కొన్ని ఉంటాయి కదా!" అని మాలతి అన్నది జ్ఞాపకానికి వచ్చింది. పాపభీతి లేకుండా డబ్బుతో నా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినప్పుడు నా కిదంతా తోచలేదు. చిన్నదైనా మాలతికి ఉన్న వివేకం నాకు లేకపోయింది. ఇప్పుడు తెలిసినా లాభం ఏమిటి? రేపు ఎక్కడో అక్కడ సీటు మాలతికోసం — ఆఖరికి డబ్బు పోసైనా — కొనగలనేమో! కానీ మాలతి జీవనానికి ఆధారమైన శేఖరాన్ని నిలువెత్తు డబ్బు పోసినా కొనగలిగానా? ఈ మనుష్యులకి వేరే నరకాలు ఉంటాయేమిటి? ఈ జన్మలో చేసిన పాపఫలం ఈ జన్మలోనే అనుభవించవలసిందే! ఏ మాలతి సుఖం కోరుకున్నానో ఆ మాలతి శేఖరాన్ని తలుచుకుంటూ విరాగిణిలాగ జీవిస్తూంటే నేను చూస్తూండాలి. పాపభీతి లేకుండా క్షణికసుఖాల కోసం ప్రాకులాడిన నాకు నా పాపాలకి ఇంతకంటే వేరే ఏ శిక్ష కావాలి? ఇదంతా నా స్వయంకృతం. దీనికంతకీ నేనే కారకుణ్ణి. ★